మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ఎమ్మెల్యే వసంత

మైలవరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని, ఈ రంజాన్ పర్వ దినాన్ని అందరూ సంతోషంగా జరపుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఈద్గాలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండగ అన్నారు. అల్లాహ్ దయతో అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం పెద్దలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

నూజివీడు : ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) వేడుకలను శనివారం ముస్లింలు మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రార్థనా స్థలాల్లో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి రంజాన్ ప్రార్థనలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా దీవెనలు ప్రజలపై ఉండాలన్నారు. మండలంలోని బోర్వంచ, మీర్జాపురం, తుక్కులూరు, మొర్సపూడి తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.



మైలవరం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఎ.కొండూరు: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



విస్సన్నపేటలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ఆగిరిపల్లి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాబూఖారీ మసీదులో దర్గా పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజా ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, దాములూరు, కేతనకొండ, కాచవరంలో ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు ముగించి ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు.

ఎ.కొండూరులో..

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, ఏ.కొండూరు, కంభంపాడు పలు గ్రామాల్లోని ముస్లింలు శనివారం రంజాన్ పండగను ఘనంగా నిర్వహించారు. అనంతరం మత గురువులు మాట్లాడుతూ ధనికులు పేదలకు సహాయ సహకారాలు అందించి ఆదుకోవడం వల్ల పుణ్యం లభిస్తుందని ఉద్బోధించారు. కార్యక్రమంలో ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహీయుద్దీన్, మసీదు ముతవల్లి మహమ్మద్ ఖాదర్ మొహీద్దీన్, జాఫర్ షరీఫ్, తాజ్‌ఖాదర్‌బాబు, సాదీ కరీముల్లా, అసదుల్లా, ఖాజా మొహీద్దీన్, ఇస్మాయిల్, హుస్సేన్‌బాబు, సుభానీ పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం, రాఘవాపురం, మద్దుల పర్వ, ముచ్చునపల్లి, కుదప గ్రామాల్లో శనివారం ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మతగురువు ఎస్కే మహమ్మద్ సాహెబ్ మాట్లాడుతూ పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయాలన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి : మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం తోటల్లో సామూహిక నమాజ్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని మిఠాయిలు పంపిణీ చేశారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: రంజాన్ పండగను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదు ప్రాంగణంలో ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరికి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, రాజేష్ దంపతులు మాజీ కో–ఆప్షన్ సభ్యుడు, పలువురు ముస్లింల ఇళ్లకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని ఈద్గా వద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలను మత గురువు మకరం హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈదర, శోభనాపురం, నెక్కలం గొల్లగూడెం, కొత్త సూరవరం గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈద్గా రోడ్డుకు హామీ



తిరువూరు ఈద్గాలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కె. రక్షణనిధి

తిరువూరు: మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినం నిలుస్తుందని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. తిరువూరు ఈద్గాలో రంజాన్ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని ముస్లింలకు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. అన్ని మతాల సారం ఒక్కటేనని, 30 రోజుల పాటు ఉపవాసాలు నిర్వహించి రంజాన్ పండగ జరుపుకుంటున్న ముస్లింలకు అభినందనలు తెలియజేశారు. ఈద్గా రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జామియా మసీదు మౌల్వీ రజ్వీ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో తిరువూరు మండలంలోని పలు గ్రామాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు, తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు డిగ్రీ కళాశాలలో హాస్య ప్రాధాన్యంపై సదస్సు

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ నెల 24న ఆధునిక సాహిత్యంలో హాస్య ప్రాధాన్యం అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం తెలిపారు. సదస్సులో ముఖ్య అతిథిగా తెలుగు, సంస్కృతం అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొంటారని పేర్కొన్నారు. అతిథులుగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ఏపీ కళాశాలల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, ఎల్‌బీఆర్ ట్రస్టు ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

పేదలకు ఓటీఎస్ పట్టాలు వరం



నూజివీడు: పేద, మధ్యతరగతి ప్రజలకు వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పాతరావిచర్లకు చెందిన 110 మంది లబ్ధిదారులకు శనివారం ఓటీఎస్ పట్టాలను ఎమ్మెల్యే ప్రతాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎలాంటి పత్రాలు లేని ఇంటికి, ఇంటి స్థలానికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందన్నారు. ఈ పట్టాతో తమ స్థలాలకు బ్యాంకు రుణాలు తీసుకోవడం, అవసరానికి విక్రయించుకోవడం వంటి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం హక్కు కల్పించినట్లేనని, గతంలో టీడీపీ ప్రభుత్వం ఏనాడు కూడా ఇలాంటి ఆలోచన చేయలేదన్నారు. ప్రజల కోసం పరిపాలించే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ఇప్పటికే మండలంలో వేలాది మందికి నివేశన స్థలాలు ఇవ్వడమే కాకుండా అందరికి గృహాలను సైతం మంజూరు చేసి ఒకొక్కరికి ఉచితంగా రూ.1.80లక్షలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నపూర్ణమ్మ, వైస్ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహనీయులు సూచించిన మార్గంలో నడవాలి

ఏ.కొండూరు: మహనీయులు సూచించిన మార్గంలో నడవడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఏఏటీఎస్‌టీఏ దర్బార్ నిర్వాహకులు అతా మహమ్మద్ నిజాముద్దీన్ నిజామీ షా తాజ్ ఖాదరి పేర్కొన్నారు. చీమలపాడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చీమలపాడు గ్రామంలో వేంచేసియున్న సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా ఆశీస్సులతో గురువు ఆజ్ఞే శిరోధార్యంగా వేమూరు మండలం జంపని గ్రామంలో రంజాన్‌మాసంలో 30రోజులు ఉపవాసదీక్షపరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. బాబా వారికి ప్రియ శిష్యులుగా ఉంటూ గత కొన్ని సంవత్సరాల నుంచి జంపని గ్రామంలోని దర్బార్‌లో అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసుల నమోదు

ఆగిరిపల్లి : మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఎన్.చంటిబాబు అన్నారు. ఆగిరిపల్లిలో రోడ్డు భద్రత–మైనర్ డ్రైవింగ్‌పై శనివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనదారులకు అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత



ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలోని హీల్ స్కూల్ వైద్య విభాగానికి విజయవాడకు చెందిన దాత టి.సుబ్బారావు శనివారం కృత్రిమ ఆక్సిజన్‌ను అందజేశారు. రూ.80 వేల విలువ గల కృత్రిమ ఆక్సిజన్‌ను అమెరికా నుంచి తెప్పించారు. హీల్ స్కూల్లోని 800 మంది విద్యార్థులకు అత్యవసర సమయంలో ఈ కృత్రిమ ఆక్సిజన్ ఎంతగానో దోహదపడుతుందని హీల్ కార్యదర్శి లక్ష్మీ అన్నారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి ఇండియన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు పీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పదో తరగతిలో 44 శాతం వాల్యుయేషన్ పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి మూల్యాంకన 44 శాతం పూర్తయినట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. నగరంలోని బిషప్ హజరయ్య హైస్కూల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రంలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాల్యుయేషన్ తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు 89,485 ఆన్సర్ స్క్రిప్ట్స్ మూల్యాంకనం పూర్తయిందన్నారు. కేంద్రాన్ని సందర్శించిన వారిలో డీఈఓ సీవీ రేణుక ఉన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి పనులపై తాము చర్చకు సిద్ధమని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు తిరువూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ఒక్కరూపాయి అభివృద్ధి నిధులు కేటాయించకపోయినా టీడీపీ నేతలు మౌనంగా ఉండటం శోచనీయమన్నారు. ఎమ్మెల్యే రక్షణనిధి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ఈ నెల 24న బహిరంగ చర్చకు రావాలని టీడీపీ నాయకులు ఇచ్చిన పిలుపుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. ఎంపీ నానీ హయాంలో జరిగిన అభివృద్ధిని కూడా తెలియజేయాలని టీడీపీ నాయకులకు వారు సవాలు చేశారు. తిరువూరు నగరపంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, మూడు దుర్గారావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ నగర బహిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నగరంలో గంజాయి అమ్ముతున్న మహిళను నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా నగర బహిష్కరణ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న జొన్నలగడ్డ సారమ్మ అలియాస్ శారద అనే మహిళ నిబంధనలకు విరుద్ధంగా గంజాయి విక్రయిస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడింది. జైలుకు వెళ్లి వచ్చినా కూడా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడం, ప్రధానంగా నగరంలోని యువతను పెడదోవపట్టించేలా గంజాయి విక్రయాలు చేస్తోంది. తన నేరప్రవృత్తిని మార్చుకోకపోవడంతో సీపీ ఆమెను నగరం నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. నగర ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా వారిపై ఇలానే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరస్తులు తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



పాతరావిచర్లలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు : ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పాతరావిచర్లలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాల వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలను నిర్మించడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. అంతేగాకుండా గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులే లేని పరిస్థితుల నుంచి నేడు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు చొప్పున వైద్యులను నియమించి, వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో మల్టీలెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)ను నియమించి ఫ్యామిలీ హెల్త్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రభుత్వ రంగంలో వైద్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రయత్నమే చేయలేదన్నారు. పైగా ప్రభుత్వ ఆస్పత్రిల్లో యూజర్ చార్జీలను తీసుకొచ్చిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని, చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని వంద శాతం అమలు చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాబోయే ఎన్నికల్లో సైతం ప్రజలు జగన్ వెంటే ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బసవరాజు అన్నపూర్ణమ్మ, ఉప సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బొర్రా సాంబశివరావు, నాయకులు బసవరాజు నగేష్, ఆరేపల్లి రాంబాబు, దేవరకొండ మధు, మరీదు మోహన్, ట్రాన్స్‌కో ఏఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం తగదు

ఏ.కొండూరు: తిరువూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధిని మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, మాజీ ఎంపీపీ వాసం మునీయ్యలు విమర్శించడం తగదని నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెల్లూరి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు కోట పుల్లారావు పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ ఎంపీ కేశినేని నాని ఈ ప్రాంతానికి అభివృద్ధి చేశారని గొప్పలు చెప్పుకోవడం వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. ఈ నియోజకవర్గానికి గత తొమ్మిది సంవత్సరాలుగా కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధికి బాటలు వేసిన ఘనత ఎమ్మెల్యే రక్షణనిధికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎం.సీతయ్య, కే శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు, నాయకులు కే చిన్నారావు, ఎస్ నరసింహారావు, ఎస్ వెంకటేశ్వరరావు, పెదబాబు, పి.చంద్రమోహనరావు, బి.శ్రీను, ఎం.రవి, శ్రీను, సతీష్, రేజా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నాయకుల చేరిక



టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, నేతలు

ముసునూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి, పురోగతి కోసం పట్టుదలగా, నిరంతరం శ్రమించాలని జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపూడి దళితవాడలోని ఐదు కుటుంబాలకు చెందిన 22 మంది టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన మండల పార్టీ సభ్యుడు వేమూరి సతీష్, గ్రామ పార్టీ కార్యదర్శులు బొల్లిన నాగరాజు, ధర్మారావు, నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నేతలు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, స్థానిక సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వి.వల్లీ పద్మజ రాంబాబు పాల్గొన్నారు.

అభ్యుదయ కవి శ్రీకలం మృతి



తిరువూరు: అభ్యుదయ కవి దారా సత్యనారాయణ (85) శనివారం మృతిచెందారు. కొద్దికాలంగా ఆయన అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. పలు దిన, వార, మాస పత్రికల్లో కవితలు, వ్యాసాలు రాసిన ఆయన తిరువూరు ప్రాంత ప్రజలకు శ్రీకలంగా చిరపరిచితులు. సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ శ్రీకలం రాసిన కవితలు విశేష ఆదరణ పొందాయి. దేశ విదేశాల్లో ప్రధానులుగా, అధ్యక్షులుగా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా నియమితులైన వెంటనే శ్రీకలం వారికి క్రమం తప్పకుండా అభినందన పత్రాలు పంపేవారు. కల్యాణవేడుకల్లో వధూవరులకు అభినందనలు తెలియజేసే కవితలు రాయడంలో శ్రీకలం అందెవేసిన చేయి. ఈ ప్రాంతంలో జరిగే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీకలం కవిత తప్పక చదివి వినిపించాల్సిందే. అభ్యుదయ రచయితల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేపాక రఘునందన్, స్థానిక కవులు శ్రీకలం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీకలం నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి తిరువూరు లయన్స్ క్లబ్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులు అందజేశారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా రవిబాబు



నూజివీడు: రోటరీక్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ నూతన అధ్యక్షుడిగా స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబును పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పీడీ వెంకటరత్నం, కోశాధికారిగా ఎం.రత్నాకరరావు ఎన్నికైనట్లు ప్రస్తుత అధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుపై దుష్ప్రచారాలు మానుకోవాలని మండల టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ నేతలు సూచించారు. కొర్లగుంటలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగ వల్లేశ్వరరావు అధ్యక్షతన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి మాట్లాడుతూ టీడీపీ హయాంలో మండల మహిళా సమాఖ్యకు విలువ లేకుండా చేసి, జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులతో ఆ పార్టీకి చెందిన వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయించుకున్న చరిత్రను మర్చిపోవద్దన్నారు. ఎక్కడా ఎవరికీ సెంటు భూమి కూడా ఇవ్వని టీడీపీ ఇల్లు నిర్మించుకుంటుంటే మట్టి తోలుకోకుండా అడ్డుకున్న చరిత్ర అప్పుడే మర్చిపోయారా? విమర్శలు చేసే ముందు ఆలోచించి, స్థాయికి తగిన విమర్శలు చేయాలని, చౌకబారు విమర్శలు చేయవద్దన్నారు. మండల నాయకుడు రంగు కరంచంద్ గాంధీ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్ మాట్లాడుతూ తాము చేస్తున్న అభివృద్ధి పనుల్లో లోపాలు గుర్తిస్తే సలహా ఇవ్వండి, నూరు శాతం అభివృద్ధి సాధిస్తామన్నారు. మూల్పూరి మాట్లాడుతూ మాజీ మంత్రి నూజివీడు ప్రాంత అభివృద్ధి పితామహుడు మేకా రంగయ్య అప్పారావు(ఎంఆర్ అప్పారావు)కు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావుకు సంబంధం లేదని వ్యాఖ్యానించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాట్రేనిపాడు, గుళ్లపూడి, చెక్కపల్లి గ్రామ పార్టీ నేతలు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతుల బకాయిలు చెల్లించిన ఘనత వైఎస్సార్ సీపీదే



విలేకరులతో మాట్లాడుతున్న దేశిరెడ్డి

చాట్రాయి: చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు ఇచ్చిన రైతులకు బకాయిలు చెల్లించిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పిట్లవారిగూడెం వంతెన వద్ద వైఎస్సార్ సీపీ మండలనాయకుల ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయలేక పోయిందన్నారు. పిట్లవారిగూడెం ఎస్సీల భూముల్లో మట్టి పోసి నష్టపరిహారం ఇవ్వకపోతే ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసికెళ్లి రూ.20 కోట్లు ఎస్సీ రైతులకు చెల్లించామన్నారు. అదే విధంగా వంతెన వద్ద మట్టిని నెల రోజుల పాటు తొలగించి ముసునూరు, చాట్రాయి మండలాలకు సాగునీరు పంపిణీ చేశామని చెప్పారు. టీడీపీ హయాంలో అదిగో నీరు, ఇదిగో నీరు అంటూ ప్రగల్భాలు పలికి చేతులు ఎత్తివేశారని, అలాంటి వాళ్లు సెల్ఫీ చాలెంజ్‌లు విసరడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.50 కోట్ల కట్ అండ్ కవర్ పనులు పగలకొట్టి వేంపాడు మేజర్‌కు సాగర్ జలాలు పంపిణీ చేయలేకపోయారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.250 కోట్లు సీఎం కేటాయించా రని, త్వరలోనే ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేసి గోదావరి జలాలను పంపిణీ చేస్తుందన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బాల కృష్ణ, నాయకులు బాబ్జీ, ప్రసాదుబాబు, వాసు, నాగేశ్వరరావు, చెన్నారావు, నరసింహారావు, టి.రమేష్, నాగేశ్వరావు, శ్రీనివాసరావు, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్

విస్సన్నపేట: అహర్నిశలు ప్రజలతో మమేకమై సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా నియోజకవర్గంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి గురించి స్థాయి మరచి కొంతమంది టీడీపీ నాయకులు మాట్లాడటం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్ అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడారు. ఎ.కొండూరు మాజీ ఎంపీపీ వాసం మునియ్య స్థాయి మరచి ఎమ్మెల్యేపై సవాళ్లు విసరడం పట్ల ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఎటువంటి సవాళ్లకైనా వైఎస్సార్ సీపీ సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ జి.మల్లయ్య, నాయకులు రాజేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముద్దాయి సమను

మహారాజశ్రీ తిరువూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
సి.సి.1779 / 2017

[illegible]

(కోర్టు వారి ఉత్తరువు మేరకు) [illegible]
తిరువూరు, 22-04-2023.
[illegible] శ్రీనివాసరావు, ఎం.ఎ., బి.ఎల్., న్యాయవాది, [illegible] తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా.
సెల్: [illegible]